కథ

# ప్రశ్న

- పరుచూరి వెంకటేశ్వరరావు



**కోడి కూతతో ఆ పల్లె నిద్రలేచింది. పల్లెలోని ఆడవాళ్లు పేడనీళ్లతో కళ్లాపి చల్లి శ్రీలక్ష్మికి స్వాగతం చెబుతున్నట్టుగా భూదేవిని ముగ్గులతో అలంకరిస్తున్నారు.**

లేత బుగ్గల పాలెగాండ్లు వెండమీద కట్లపాముల్లాంటి కర్రల మీద తమ రెండు చేతులూ వేసి రాజసంగా శ్రీకృష్ణున్ని మరిపిస్తూ నడుస్తున్నారు. తమ ముందు 'అంబా' అంటూ వందల పశువులు దుమ్ము రేపుతూ నడుస్తున్నాయి. భుజాన నాగళ్ళతో రైతులు హడావుడిగా తమ పొలాలవైపు కదుల్తున్నారు. అందరిలాగే కోడికూత చెవిన పడగానే లేచిన చంద్రయ్య వేప్పుల్ల నోట్లో వేసుకుని ''నేను చేనుదాకా పోయొస్తా'' అంటూ భార్య సుభద్రతో చెప్పి బయటకి కదిలాడు. తన పొలం చేరుకుని మోటబావి దగ్గర మొహం కడుక్కున్నాడు చంద్రయ్య. పొలం గట్టుమీద పారే పిల్లకాలువ నీళ్లను కడుపునిండా తాగి భుజాన వున్న కండువాతో మొహం తుడుచుకుంటూ తన చేనువైపు చూసాడు. భూదేవి మొక్కలకు జన్మనిస్తే ఆ మొక్కలు ఆకాశంలోని తెల్లటి మబ్బుల్ని అరువు తెచ్చుకున్నాయా అన్నట్టుగా కదులుతున్నాయి తెల్లటి పత్తిపూలు.

చంద్రయ్య ముఖంలో ఆనందం. అడుగు ముందుకేసాడు. పత్తి మొక్కల్ని సమీపిస్తున్న కొద్దీ అతనిలో సంతోషం రెట్టింపవుతోంది. చేను మధ్యగా

వెళ్ళి 'భగవంతుడా..నువ్వున్నావ్ పైనుంచి అన్నీ చూస్తుంటావ్. ఈ చిన్న రైతును కరుణించావ్ ... నీకు వేల వేల నమస్కారాలు' అన్నట్టుగా ఒక్కసారి తలపైకెత్తి ఆకాశంలోకి చూసాడు. సూర్యుడు తనని ఆశీర్వదిస్తున్నట్టుగా అనుభూతి పొందుతూ తన పత్తి చేనుని చూసుకొని మురిసిపోతున్నాడు. అప్పుడే 'చంద్రయ్యా' అంటూ చేతిలో క్యాష్‌బ్యాగ్‌తో వచ్చాడు పత్తి వ్యాపారి సుబ్బయ్యశెట్టి. పత్తి చేను వైపు చూస్తూ 'ఈసారి పత్తి పంటతో నీ కష్టాలన్నీ గట్టెక్కినట్టే చంద్రయ్యా' అన్నాడు శెట్టి.

"ఏదో తమ దయ" అంటుండగానే క్యాష్ బ్యాగులో నుండి డబ్బు తీసి చంద్రయ్యకిస్తూ "అడ్వాన్స్ యాభైవేల రూపాయలు. పత్తి లారీకి ఎత్తేరోజు మిగతా బ్యాలెన్స్ డబ్బులిస్తాను" అంటూ చంద్రయ్యకు రెండు నోట్ల కట్టలు ఇచ్చాడు శెట్టి.

పత్తిపంట అమ్మకానికి అడ్వాన్స్‌గా వచ్చిన డబ్బుల కవర్‌ని పసిబిడ్డలా పట్టుకుని హాస్పిటల్ కారిడార్‌లో నడుస్తున్నాడు చంద్రయ్య. పక్కనే వున్న ఎమర్జెన్సీ వార్డులో చంద్రయ్య కూతురు సరోజ ఆయాసంతో ఎగిరెగిరి పడుతోంది. పదేళ్ళకే బ్రెయిన్ ట్యూమర్ బారినపడ్డ కూతురి బాధ చూడలేక దుఃఖాన్ని అణచుకుంటోంది అక్కడే కూర్చున్న సుభద్ర.

చేతిలో కవర్‌తో వచ్చిన చంద్రయ్యను చూసిన సుభద్ర ఒక్క ఉదుటున చంద్రయ్యను చూసి లేచి నిలబడి "తెచ్చావయ్యా ... డబ్బు కడితే గానీ ఆపరేషన్ చెయ్యనంటున్నారు" అంటూ భోరున ఏడుపు మొదలెట్టింది.

"ఏడవకు సుభద్రా డబ్బు తెచ్చాను. మన బిడ్డకు తగ్గిద్ది" అంటూ కవర్‌లోంచి డబ్బు బయటకు తీసి చూపించాడు.

"యెళ్ళి తొందరగా డబ్బు కట్టయ్యా పిల్లను చూస్తుంటే నాకు భయంవేస్తావుంది" అంటూ చంద్రయ్యను తొందర పెట్టింది సుభద్ర.

డాక్టర్ల రెస్ట్ రూం తలుపులు తోసుకుని లోనికొచ్చిన చంద్రయ్యను చూసి విసుక్కోబోయిన డాక్టర్ రామానుజం అతని చేతిలోని నోట్ల కట్టలు చూసి "ఏం చంద్రయ్యా నీ బిడ్డ ఆపరేషన్ కోసం యాభైవేలూ తీసుకొచ్చావా" అని అడిగాడు.

"తెచ్చాను డాక్టరు బాబూ, నా బిడ్డను ఎలాగైనా కాపాడండి" అంటూ చేతిలోని నోట్లకట్టలు డాక్టర్ టేబుల్ మీద పెట్టాడు చంద్రయ్య.

"నీకూతురికేం ఫరవాలేదు. ఆపరేషన్ చేస్తే తప్పకుండా కోలుకుంటుంది" అంటూ మురిపెంగా నోట్లకట్టల్ని చేతిలోకి తీసుకున్నాడు డాక్టర్.

చంద్రయ్య సంతోషంగా బయటికొచ్చాడు.

'నేను డబ్బులు కట్టేశాను నా బిడ్డ బతుకుతుంది... నేను డబ్బులు కట్టేశాను నా బిడ్డ బతుకుతుంది' అని కలవరిస్తూ మంచంపై అటూ ఇటూ కదుల్తున్న చంద్రయ్య దగ్గరికొచ్చింది సుభద్ర.

"ఏవయ్యా ఏందీ కలవరింపు. పొద్దెక్కింది లే" అంటూ చంద్రయ్యను తట్టి లేపింది.

ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచిన చంద్రయ్య తను ఇంట్లోనే ఉన్నానని తెలుసుకుని "సుభద్రా నేను సరోజ ఆపరేషన్‌కు డబ్బు కట్టలేదా, నేను మన పత్తి అమ్మలేదా" అని గొణుక్కున్నట్టుగా అన్నాడు.

"పత్తి ఎప్పుడు అమ్మావ్, డబ్బు ఎప్పుడు కట్టావ్ ఏదో కలగన్నట్టున్నావ్ గానీ లేచి మొఖం కడుక్కో, ఇన్ని టీ నీళ్లు తాగుదువుగానీ" అంటూ పొయ్యి వైపు కదిలింది సుభద్ర.

***

వరుగులాంటి నడకతో చంద్రయ్య హాస్పిటల్‌లోకొచ్చి ఎమర్జెన్సీ వార్డు వైపు చూసాడు. పదేళ్ళ కూతురు సరోజ బెడ్‌మీద ప్రాణాలతో పోరాడుతోంది. ఏం చెయ్యాలో తెలియని అమాయకపు చూపుతో చంద్రయ్య తల్లి 'నేను నీకు కావలా మాత్రమే ఉండగలనమ్మా' అన్నట్టుగా చూస్తోంది. పొంగుకొస్తున్న దుఃఖాన్ని అణచుకుంటూ చంద్రయ్య డాక్టర్ల గదిలోకి వెళ్ళాడు.

"అయ్యా డాక్టర్ బాబూ ... నా బిడ్డను ఎలాగైనా మీరే కాపాడాలి" చివరి ప్రయత్నంగా ప్రాధేయపడ్డాడు చంద్రయ్య.

"చంద్రయ్యా ... ఊరికే కాపాడమని కన్నీళ్లు పెట్టుకుంటే పనవదయ్యా. యాభైవేలు తీసుకురా. ఆపరేషన్ చేసి నీకూతుర్ని క్షేమంగా ఇంటికి పంపిస్తాం.

లేదంటే నీ కూతురి శవాన్నే తీస్కెళ్ళాల్సొస్తుంది'' అంటూ నిష్కర్షగా చెప్పాడు డాక్టర్ రామానుజం.

''అయ్యా అంతమాటనకండి బాబూ ... నేను డబ్బు తీసుకొస్తాను డబ్బు తీసుకొస్తాను'' అంటూ కంగారుగా బయటికి కదిలాడు చంద్రయ్య.

❊ ❊ ❊

ఆసుపత్రిలో వున్న కూతురి ఆలోచనలు చుట్టూ ముసురుతుండగా చేలగట్ల వెంట నడుస్తున్నాడు చంద్రయ్య. పది నిమిషాల నడక పావుగంటైనా తెగలేదు. నిన్న సాయంత్రం అరికాలిలో దిగబడిన ముల్లు గుండెలోని బాధతో పోటీ పడ్డట్టుగా సలుపుతోంది. భుజాన కండువా సవరించుకొని తన పత్తి చేనువైపు దృష్టి సారించాడు చంద్రయ్య.

తెల్లటి మబ్బులు గాలికి కదిలినట్టుగా, అంతఃపురంలో రాణిగారిని సేదతీర్చే చెలికత్తె చేతిలోని వింజామరలాగా పైరగాలికి అటూ ఇటూ కదులుతూ చంద్రయ్యకు స్వాగతం చెప్పాయి పత్తికొమ్మలు.

చంద్రయ్య ఆనందంతో అడుగు ముందుకేసాడు. పత్తి మొక్కల్ని సమీపిస్తున్న కొద్దీ అతనిలో ఆనందం రెట్టింపవుతోంది. చేను మధ్యలోకెళ్ళిన చంద్రయ్య నిండు పౌర్ణమినాడు చల్లని కాంతులతో ప్రకాశించే చందమామలా తలెత్తి చూస్తున్న పత్తికొమ్మను ఆప్యాయంగా తడిమి చూసాడు. చంద్రయ్య ముఖంలో ఆనందం కొంచెం కొంచెం మాయమవుతుంది. కంగారుగా చేనంతా కలియతిరిగాడు.

ఏ పత్తిపువ్వును చూసినా పచ్చపురుగు తొలవడం కనిపించి అక్కడే కూలబడిపోయాడు కూతుర్ని తలుచుకుంటూ.

అప్పుడే సుభద్ర సద్దిమూటతో అక్కడికొచ్చింది. చంద్రయ్య చేలో ఏడవటం చూసి మూట గట్టున పెట్టి ''ఏమైందయ్యా'' అంటూ చంద్రయ్య దగ్గరికొచ్చింది సుభద్ర. ''చేనుకు చీడపట్టిందే'' అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నాడు చంద్రయ్య.

సుభద్ర కంగారుగా చేనంతా కలియ తిరిగింది. భార్య బాధను బయటపెట్టలేక లోలోపలే దాచుకుంటూ తెచ్చిన సద్ది చంద్రయ్యకు వడ్డించింది. బలవంతం మీద ఇష్టం లేకున్నా నాలుగు ముద్దలు తిన్నాననిపించాడు.

''ఇప్పుడేం చేద్దామయ్యా'' మెల్లిగా కదిపింది సుభద్ర.

''ఎకరం చేనున్న రైతునే నేను. ఊరు ఊరంతా తిరిగాను ఉప్పుకూడా పుట్టేట్టు లేదు. ఏం చేయను'' అన్నాడు చంద్రయ్య.

''అప్పు దొరకలేదని కూచుంటే ఎట్టాగయ్యా, మనూరి సర్పంచ్ బామ్మర్ది రాజారావ్‌ను ఒకసారి కలువు. పార్టీల్లో తిరిగేవోడు గదా, ఆయన పరపతి ఏమైనా పనికొస్తదేమో'' సలహా ఇచ్చింది సుభద్ర.

''సరే చూస్తా'' అంటూ లేచాడు చంద్రయ్య.

❊ ❊ ❊

సారాకొట్టు దగ్గర కూర్చున్న రాజారావు గ్లాసులో పడ్డ ఈగను వేలితో తీసేసి ఒక్క గుక్కలో సారా గొంతులోకి దింపేసి ''ఈసారి కూడా మా బావేరా సర్పంచ్'' అన్నాడు.

''మీకు జోస్యం తెలుసా బాబూ'' అన్నాడు ప్రక్కనే కూర్చున్న వ్యక్తి.

''నాకు రాజకీయం తెలుసురా'' అన్నాడు రాజారావు.

''నీకు అన్నీ తెలుసయ్యా. కానీ కేసెట్టా కొట్టేయించుకోవాలో తెలీదు'' అన్నాడు అప్పుడే అక్కడికొచ్చిన హెడ్ కానిస్టేబుల్ వెంకటాద్రి.

''ఎప్పుడో ఎలక్షన్ల నాటి కేసు. ఇప్పుడు తిరగదోడటమెందుకండీ'' అన్నాడు రాజారావు.

''ఎప్పటిదైనా కేసు కేసేనయ్యా. నువ్వో పదివేలిస్తే ఆ కేసు మాఫీ చేయిస్తాను. ఎప్పుడిస్తావో చెప్పు'' అన్నాడు హెడ్డు.

''కేసు సంగతి పక్కన పెట్టండి హెడ్డుగారూ. మొన్న మా గోపయ్య ఇంట్లో ఉరేసుకు ఛస్తే చేను దగ్గర చచ్చిపోయాడని దొంగ పంచనామా రాసి ఎంత పట్టావో నాకు తెలీదనుకున్నారా'' అని గొంతు తగ్గించి మెల్లిగా అన్నాడు రాజారావు.

ఉలిక్కిపడిన హెడ్‌కానిస్టేబుల్ టోపీ సవరించుకుంటూ ''ఈ విషయం నీకెలా తెలిసిందయ్యా బాబూ'' అన్నాడు.

''నేను రాజారావునండీ రాజకీయం తెలిసినోణ్ణి. నాకు తెలియకుండా వుంటుందా'' నీ గుట్టు నాకు

తెలిసిందన్నట్టుగా చెప్పాడు రాజారావు.

"గోపయ్య ఇంట్లో చచ్చాడని రాస్తే ఎవరికి ఉపయోగమయ్యా. అందుకే చేలో చచ్చాడని రాసాం. లక్షరూపాయల ఎక్స్‌గ్రేషియా వచ్చింది. యాభైవేలు గోపయ్య పెళ్ళానికిచ్చాంలే గానీ ఈ విషయం ఎక్కడా చెప్పకయ్యా బాబూ" అన్నాడు హెడ్డు.

"మరి నాకేసు సంగతి" అడిగాడు రాజారావు.

"అది క్లోజ్ చేయిస్తాన్లేవయ్యా బాబూ" అంటూ వెళ్ళిపోయాడు హెడ్డు. అంతలో

''నమస్కారం బాబుగారూ. నన్ను మీరే కాపాడాల'' అంటూ అక్కడికొచ్చి కూర్చున్నాడు చంద్రయ్య.

"ఏమైంది చంద్రయ్యా" అన్నాడు రాజారావు.

"నా పత్తి చేనుకు పురుగు పట్టింది బాబుగారూ. సొసైటీల లోను ఇప్పిస్తే పత్తి చేతికొస్తది ... దాంతో నా బిడ్డని బతికించుకుంటాను బాబూ. కాస్త మీరే సాయం చెయ్యాల" దీనంగా అడిగాడు చంద్రయ్య.

"ఆ సంగతి నేను చూసుకుంటాను గానీ ముందీ గళాసు సారాకొట్టు" అంటూ చంద్రయ్యను కొట్టులోకి తీస్కెళ్ళాడు.

కాస్సేపటికి ...

రాజారావుతో పాటు చంద్రయ్య కూడా తూలుతూ బయటికొచ్చాడు.

"బాబూ మరి నా లోను సంగతి ... !" గుర్తు చేసాడు చంద్రయ్య.

"లోను అంత తొందరగా ఎవడిస్తాడయ్యా ... ఉపాయం చెప్తాను అలాచెయ్"

"చెప్పండి బాబూ ... నా బిడ్డ బతకాల నా చేను బతకాల. దానికోసం ఏమైనా చేస్తాను. ఏం చేయాలో చెప్పండి" రాజారావు చెప్పే మాటకోసం ఎదురు చూస్తూ అన్నాడు చంద్రయ్య.

రాజారావు చెప్పిన మాటవిని ఒక్కసారిగా భూమి కంపించిపోయినట్టు వణికిపోయాడు చంద్రయ్య. అతని కళ్ళ ముందు కన్న కూతురు, కన్నబిడ్డలా చూసుకున్న పత్తిచేను కదలాడింది.

వెంటనే ఒక నిర్ణయానికొచ్చాడు చంద్రయ్య.

"అలా చేస్తే డబ్బులొస్తాయంటావా బాబూ" చంద్రయ్య గుండెని మెలిపెడుతున్న మాట బలవంతంగా గొంతు దాటింది. "అవన్నీ నేను చూసుకుంటానుగానీ, తాగిన సారాకు డబ్బులిచ్చి సంతోషంగా వెళ్ళిపో" అన్నాడు రాజారావు.

"అట్టాగే బాబూ వెళ్ళిపోతాను ..." అంటూ కిందపడ్డ కండువా తీసుకుని భారంగా బయటికి కదిలాడు చంద్రయ్య.

❊ ❊ ❊

తెల్లటి ఆకాశంలో నల్లటి గద్దలు రెక్కలు చాచి అటూ ఇటు తిరుగుతున్నాయి. పత్తి చేలో పూలు ఏడ్చి ఏడ్చి కన్నీళ్లు లేక స్పృహ తప్పి పడిపోయిన సుభద్రను చూసి తలలు దించుకున్నట్టుగా నేల చూపులు చూస్తున్నాయి.

ఊరిజనం తండోపతండాలుగా పరుగెత్తు కొస్తున్నారు.

ఏం జరిగిందని అడగటానికి ప్రయత్నిస్తున్నవారికి ఎవ్వరూ చెప్పే స్థితిలో లేరు.

అందరూ చంద్రయ్య పత్తిచేను దగ్గరికి చేరుకున్నారు. పత్తిచేను పక్కనే వున్న వేపచెట్టు కొమ్మకి చంద్రయ్య కండువా వేలాడుతోంది ... కానీ అందరి దృష్టీ కండువా మరో చివరికి వేలాడుతున్న చంద్రయ్య శవంపైనే వుంది. అతని కళ్లు వాడిన పత్తిచేనునే చూస్తున్నాయి. పత్తిచేను మాత్రం వాడిపోయి కొనఊపిరితో వున్న రోగిలా నిస్సారమైన కళ్లతో చంద్రయ్యనే చూస్తోంది.

❊ ❊ ❊

చంద్రయ్య, సరోజల ఫోటోలు పక్కపక్కనే ఒక స్టూలుమీద పెట్టి వున్నాయి. ఆ ఫోటోలకు వేలాడుతున్న మల్లెదండలు తెల్లచీరలో వున్న సుభద్రను చూసి నోటమాట రానట్టు మౌనంగా వున్నాయి. ప్రాణం కళ్లల్లో పెట్టుకున్నట్టుగా కన్నీళ్లు కారుస్తూ కొడుకు, మనవరాలి మరణాన్ని తట్టుకోలేక, కోడలి వైధవ్యాన్ని చూడలేక మూగగా రోదిస్తోంది చంద్రయ్య తల్లి వెంకటమ్మ. అప్పుడే కుక్క మొరుగుడు వినిపించి తలతిప్పి గుమ్మంకేసి చూసింది.

హెడ్ కానిస్టేబుల్ వెంకటాద్రి, రాజారావు, ఎమ్మార్వో అక్కడికొచ్చారు. "అమ్మా నీ కొడుకు చావును

ప్రభుత్వం గుర్తించి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చింది'' అన్నాడు ఎమ్మార్వో. వెంకటమ్మ ఆతృతగా లేచి నిలబడింది. సుభద్ర మాత్రం నిర్లిప్తంగా అలాగే చూస్తోంది.

ఎమ్మార్వో ఏదో చెప్పబోతుండగా "చంద్రయ్య నా దగ్గర యాభైవేలు అప్పుగా తీసుకున్నాడమ్మా'' అంటూ వెంకటమ్మకు ఇవ్వబోతున్న డబ్బుని లాగేసుకున్నాడు రాజారావు. దానిలోనుండి పదివేల కట్ట తీసి సైలెంట్‌గా కానిస్టేబుల్ జేబులో కుక్కేసాడు.

అందరివైపూ తెల్లబోయి చూస్తోంది వెంకటమ్మ.

"ఈ యాభైవేలు ఉంచడమ్మా'' అంటూ మరో యాభైవేలు ఇవ్వబోయాడు ఎమ్మార్వో.

వెంకటమ్మ కొంగు చాచింది.

కొంగులో పడబోతున్న డబ్బుని డాక్టర్ చేతులొచ్చి పట్టుకున్నాయి. వెంకటమ్మ ఏం చేయాలో పాలుపోక దిక్కులు చూస్తోంది. సుభద్ర మాత్రం ఇవేవీ పట్టనట్టు భర్త ఫోటో వంక చూస్తూ వుంది.

చంద్రయ్య చావుతో ఆ కుటుంబం ఒంటరిగా మిగిలిపోయింది.

చంద్రయ్య చావు ... ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రతిపక్షాలకు దొరికిన ఒక అస్త్రం.

చంద్రయ్య చావు ... తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి ప్రభుత్వం ఏడుస్తూనే చెల్లించే ఎక్స్‌గ్రేషియా.

చంద్రయ్య చావు ... ఆస్పత్రి వాళ్లు సరోజ శవాన్నివ్వటానికి తీసుకున్న ఫీజు.

చంద్రయ్య చావు ... రాజారావుకు, పోలీసులకు మిగిల్చిన కమీషను.

**మరి చంద్రయ్య బ్రతుకు ?** ✪

✤ ✤ ✤ ✤ ✤

